
సాక్షి ఒడిశా

మంగళవారం । 19 । నవంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,44,280లు, బంగారం 4 గ్రాముల 920 మిల్లీగ్రాములు వెండి 290 గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



విజిలెన్స్ దాడులు..

అధికారులపై విజిలెన్స్ వల విసిరింది. పలువురు అడ్డంగా దొరికిపోయారు.

- 8లో



ఆగిన గుండెకు జీవం

ఆగిన గుండెకు ఎయిమ్స్ వైద్యులు జీవం పోశారు. అద్భుతం చేసి చూపించారు.

- 8లో

న్యూస్‌రీల్

మల్కన్‌గిరి మహా విద్యాలయానికి ప్రిన్సిపాల్‌గా ప్రేమలేఖ



నూతన ప్రిన్సిపాల్‌కు స్వాగతం పలుకుతున్న కాలేజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉదయ్‌నాథ్ ఖోర

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఉన్న మల్కన్‌గిరి మహా విద్యాలయానికి ప్రిన్సిపాల్‌గా ప్రేమలేఖ బొత్ర బాధ్యతలు స్వీకరించారు. గత ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రో గత నెల 31న పదవీ విరమణ చేశారు. నూతనంగా నియమితులైన ప్రేమ లేఖ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతి



ఎస్పీకి వినతిపత్రం సమర్పించేందుకు వెళ్తున్న బీజేపీ శ్రేణులు

రాయగడ: స్థానిక విద్యానగర్ నాలుగో లైన్‌లోని ఓ ప్రైవేట్ సంస్థ కార్యాలయంలో ఉన్న బీజేపీ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడు బసంత కుమార్ ఉలకపై గుర్తు తెలియని దుండగులు దాడికి యత్నించారు. దీంతో అతని రక్షణ కల్పించాలని పార్టీ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ నాయకులు మంజుల మినియాక నేతృత్వంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జిల్లా ఎస్పీ స్వాతీ ఎస్.కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్న బసంత ఉలకకు ఎప్పటికైనా దుండగుల నుంచి ప్రాణాపాయం ఉన్న నేపథ్యంలో ఆయన గట్టి రక్షణ కల్పించాలని వినతి పత్రంలో కోరారు.


శియ్యాళి పంచాయతీలో ఏనుగుల సంచారం



కాశీనగర్ బ్లాక్ శియ్యాళి పంచాయతీలో తిరుగుతున్న ఏనుగులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ ప్రాంతం శియ్యాళి పంచాయతీలో రణపూర్, జీవన్‌దాస్ గుడ, హనుమంతపూర్ గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. నాలుగు ఏనుగులు ఇదివరకూ వంశధార నది ఆవలి ఒడ్డున తాలాడ గ్రామం నుంచి ఆహారం కోసం కాశీనగర్ బ్లాక్ శియ్యాళి పంచాయతీకి వచ్చాయి. చేతికి వచ్చిన ధాన్యం పంటను ఏనుగులు నాశనం చేస్తున్నాయి. సమాచారం తెలుసుకున్న కాశీనగర్ అటవీ రేంజ్ అధికారి సునీల్ కుమార్ బెహరా సిబ్బందితో శియ్యాళి చేరుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

మాజీ మంత్రి సమీర్ దే మృతి



సమీర్ దే

భువనేశ్వర్: రాష్ట్ర మాజీ మంత్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు సమీర్ దే (67) సోమవారం కన్నుమూశారు. కటక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాస సంబంధిత అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం ఆస్పత్రిలో చేరారు. క్రమంగా ఆరోగ్యం క్షీణించింది.

ప్రముఖుల సంతాపం

సమీర్ దే మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కటక్ లోక్‌సభ సభ్యుడు భర్తహరి మహతాబ్, నగర మేయర్ సుభాష్ సింగ్ తదితరులు సంతాపం వ్యక్తం చేసినవారిలో ఉన్నారు.

కటక్ నియోజకవర్గం నుంచి..

రాష్ట్ర శాసన సభకు సమీర్ దే వరుసగా మూడు సార్లు ఎన్నిక అయ్యారు. కటక్ సిటీ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించారు. 1995, 2000, 2004 సంవత్సరాల్లో వరుసగా రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో విజయం సాధించారు. బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ కూటమి ప్రభుత్వంలో 2004 నుంచి 2009 సంవత్సరం వరకు క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు. 2000 నుంచి 2004 సంవత్సరం వరకు నగర అభివృద్ధి శాఖ, 2004 నుంచి 2009 సంవత్సరం వరకు ఉన్నత విద్యా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రభుత్వ లాంఛనాలతో మాజీ మంత్రి సమీర్ దే అంత్యక్రియలు జరుగుతాయని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు.

మూడు ఏనుగులు..
మృత్యువాత

- అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి ప్రాణాలు కోల్పోయిన వైనం



మృతి చెందిన ఏనుగులు

భువనేశ్వర్: అడవిపందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి మూడు ఏనుగులు మృత్యువాత పడ్డాయి. రాష్ట్రంలో ఇటీవల తరచూ ఏనుగులు చనిపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. సోమవారం ఉదయం మూడు ఏనుగులు ఒకే చోట దుర్మరణం పాలై పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వీటిలో ఒక గున్న ఏనుగు ఉంది. పశ్చిమ ఒడిశా సంబలపూర్ జిల్లా నకొటిదెవులో రేంజ్ బురొమాల్ అటవీ ప్రాంతంలో ఈ విషాద సంఘటన వెలుగు చూసింది. ఆహారం కోసం వచ్చిన ఏనుగులు అడవిపందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల్లో చిక్కుకొని షాక్‌తో చనిపోయినట్టు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అత్యంత విచారకరమని అటవీ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో జంతువుల చొరబాటు నివారించడంతో వాటికి హాని కలగకుండా రీతిలో రాత్రింబవళ్లు పహరా ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో ఏనుగుల గుంపు విద్యుత్ తీగల్లో చిక్కుకుని షాకుతో దుర్మరణం పాలు కావడం అనుబంధ సిబ్బంది నిర్లక్ష్యమని ప్రధాన అటవీ సంరక్షణ అధికారి పీసీఎఫ్ సుశాంత నొందొ తెలిపారు. విద్యుత్ శాఖ నిఘా డీలా పడడం కూడా ఒక కారణంగా పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు కోసం ఆదేశించినట్లు ప్రకటించారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా బాధ్యులను గుర్తించి చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.

భువనేశ్వర్: విద్యుత్ తీగల్లో చిక్కుకుని ఏనుగులు దుర్మరణం పాలైన సంఘటనలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా ఘటనా ప్రాంతం పరిధిలో రాత్రి పూట ఏనుగులు సంచరించే ప్రాంతంలో వన్య ప్రాణుల్ని నిర్బంధించేందుకు అక్రమంగా విద్యుత్ ప్రవాహిత తీగల్ని పన్నడంతో అవాంఛనీయ సంఘటన చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఈ ఆరోపణ కింద వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

డ్యామ్ లీక్‌పై రైతుల ఆందోళన



తెలింగిరి చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ముట్టడించిన రైతులు



అధికారులకు మెమోరాండం సమర్పిస్తున్న రైతులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితిలోగల తెలింగిరి సాగునీటి డ్యామ్‌లో నీరు లీక్ కావటంపై అధికారులు తలలు పట్టుకోగా.. రైతులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రబీ సీజన్‌లో నీరు అందబోదన్న వార్త చింత జయపురం, కొట్‌పాడ్, బొరిగుమ్మ సమితుల్లో 24 వేల మంది రైతులను పట్టి పీడిస్తోంది. రోజులు గడుస్తున్న కొద్దీ జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. లీకేజీని అరికట్టే మార్గం కనుగొనాలని సోమవారం రైతులు చీఫ్ ఇంజినీర్ కార్యాలయాన్ని ముట్టించారు. వెంటనే తగు చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరిస్తూ మెమొరాండం సమర్పించారు. బొరిగుమ్మ సమితిలో 9 గ్రామ పంచాయతీ రైతులు కార్యాలయం ముట్టడించటంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. డ్యామ్ లీకేజీని అరికట్టాలంటే మరమ్మతులు చేయాలి. అది జరగాలంటే నీరంతా ఖాళీ చేయాలి. అందుకు మార్గాలను ఇంజినీర్లు అన్వేషిస్తున్నారు. డ్యామ్ ఖాళీ చేయాలా లేదా మరో మార్గం చూపుతారా అన్నది ఉన్నతాధికారులు నిర్ణయంపైనే ఆధార పడి ఉన్నట్లు అదనపు చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్ పాణిగ్రహి వెల్లడించారు. దీంతో రైతులకు ఎవరూ సంతృప్తికర సమాచారం ఇవ్వలేకపోయారు. గత శుక్రవారం ఆంధ్ర నుంచి వచ్చిన ఇంజినీర్ నిపుణులు డ్యామ్‌లో నీరు పూర్తిగా ఖాళీ చేసినప్పుడే డ్యామ్ లీకేజీని అరికటేందుకు మరమ్మతు పనులు సాధ్యమని స్పష్టం చేసినట్లు సమాచారం. అదే జరిగితే రబీ పంటలకు సాగు నీరు లభించదని అంటున్నారు. కోట్లాది రూపాయిల వ్యయంతో రైతుల భూములకు సాగునీరు సమకూర్చేందుకు నిర్మించిన తెలంగిరి డామ్ నిర్మాణం జరిగి ఐదేళ్లకే నీరు లీక్ కావటం నిర్మాణ లోపమేన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. డ్యామ్ నిర్మాణంలో అవినీతి చోటు చేసుకుందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

రైల్వే స్టేషన్ వద్ద గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఇద్దరు నిందితులను పట్టుకుని వారి నుంచి 25 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. అరెస్టయిన వారిలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన సూరజ్ పాసవాన్, హర్షా శర్మలు ఉన్నట్లు గుర్తించారు. రైల్వే పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. కొరాపుట్ నుంచి అక్రమంగా గంజాయిని రాయగడకు తీసుకువచ్చిన నిందితులు రాయగడ నుంచి అహ్మదాబాద్‌కు ఆ గంజాయిని తరలించేందుకు ట్రైన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో రైల్వే పోలీసులు ప్లాట్ ఫారం వద్ద యథావిధిగా తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన వీరి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కొర్టుకు తరలించారు.

మంత్రి రాజీనామా చేయాలి: బీజేడీ

భువనేశ్వర్: మామిడి టెంకల జావ మృతులు సంఖ్య క్రమంగా పెరుగుతుండడంపై ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ మండి పడుతోంది. రాష్ట్రంలో ప్రజలకు ఆహార భద్రత కల్పించలేని దయనీయ పరిస్థితుల్లో పాలన కొనసాగడం అత్యంత విచారకరమని నాయకులు అన్నారు. లోగడ ఈ సంఘటనలో 2 మంది మృతి చెందగా సోమ వారం మరో మహిళ మృతి చెందడంతో బీజేడీ భగ్గుమంది. ఆహార భద్రత లోపించడంతో ఆకలి మంటకు గురై ఈ సంఘటనలో ఇప్పటి వరకు 3 మంది అకాల మరణానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో నైతిక బాధ్యత వహించి రాష్ట్ర ఆహార పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేడీ నాయకుడు సంజయ్ దాస్ బర్మ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.


డిజిటల్ సభ్యత్వ నమోదుకు బీజేడీ సన్నాహాలు



బిజూ యువ జనతా దళ్ సభ్యత్వ నమోదు డిజిటల్ వర్క్‌షాపు

భువనేశ్వర్: విపక్ష హోదాలో బిజూ జనతా దళ తన సత్తాని చాటుకునే సన్నాహాల్లో భాగంగా సభ్యత్వ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ప్రధానంగా యువత ఆధ్వర్యంలో ఈ సన్నాహం శక్తివంతం చేయాలనే యోచనతో అడుగులు వేస్తుంది. బిజూ యువ జనతా దళ్ ఆధ్వర్యంలో డిజిటల్ సభ్యత్వ నమోదు వర్క్‌షాపు సోమవారం నిర్వహించారు. 10 లక్షల మందిని సభ్యులుగా నమోదు చేసుకోవాలనే లక్ష్యంతో యువజన వర్గాన్ని ప్రోత్సహించారు. కార్యక్రమానికి దేవీ ప్రసాద్ మిశ్రా, అతున్ సవ్యసాచి నాయక్, ప్రణబ్ ప్రకాష్ దాస్, మున్నా ఖాన్, ప్రణబ్ బల్వంత్రాయ్, సుభాశిష్ ఖుంటియా తదితర ప్రముఖులు హాజరయ్యారు. బిజూ యువ జనతా దళ్ అధ్యక్షుడు వ్యోమ కేశ రాయ్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు.

ఘనంగా భౌగోళిక సమాచార వ్యవస్థ దినోత్సవం



జీఐఎస్ దినోత్సవంపై సావనీర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం



భౌగోళిక సమాచార వ్యవస్థ దినోత్సవ సభకు విచ్చేసిన వివిధ రాష్ట్రాల అతిథులు

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్ ఓపెన్ ఆడిటోరియంలో సోమవారం భౌగోళిక సమాచార వ్యవస్థ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐఎండీ డైరెక్టర్ డాక్టర్ శరత్ చంద్ర సాహు హాజరయ్యారు. అలాగే జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ ఎం.ఎల్ నర్సింహం, కన్వీనరు, డీన్, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ ప్రఫుల్ల కుమార్ పండా, డైరెక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢి, రిజిస్ట్రారు డాక్టర్ అనితా పాత్రో సివిల్ ఇంజనీరింగ్ ముఖ్యశాఖ విక్రం నారాయణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎం.ఎల్. నర్సింహం మాట్లాడుతూ, భౌగోళిక సమాచార వ్యవస్థ ద్వారా ప్రకృతి విపత్తులు ముందుగానే పసిగట్టి అప్రమత్తం కావచ్చని అన్నారు. జియోస్పెషల్ టెక్నాలజీ ద్వారా రిమోట్ సెన్సింగ్, జీపీఎస్ టెక్నాలజీ మనకు కచ్చితమైన సమాచారం శాటిలైట్ ద్వారా అందిస్తుందని మాజీ డైరెక్టర్ ఐఎండీ డాక్టర్ శరత్ చంద్ర సాహు అన్నారు. అనంతరం భౌగోళిక సమాచార వ్యవస్థపై ముద్రించిన సావనీర్‌ను గౌరవ అతిథులు ఆవిష్కరించారు. ఆన్‌లైన్ ద్వారా డాక్టర్ జె.మురళీధరన్, స్మార్ట్ సిటీ, భవిష్యత్ అభివృద్ధిపై మాట్లాడారు. కార్యక్రమం అనంతరం శరత్ చంద్రసాహు, ఎంఎల్ నర్సింహంలను సత్కరించారు.

మామిడి జావకు మరొక ప్రాణం బలి

- 3కి పెరిగిన మామిడి జావ మృతులు
- విచారణకు ఆదేశం



చికిత్స పొందుతూ ఐసీయూలో తుది శ్వాస విడిచిన బాధితురాలు

భువనేశ్వర్:

రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపిన మామిడి జావల మృతుల సంఖ్య పెరిగింది. సోమవారం మధ్యాహ్నం మరో బాధితురాలు కన్నుమూయడంతో ఈ మృతుల సంఖ్య 3కి పెరిగింది. ఇదివరకు ఈ సంఘటనలో 2 మంది మృతి చెందిన విషయం విదితమే. మూడో మృతురాలు జిత్తా మాఝిగా గుర్తించారు. అక్టోబరు నెల 2వ తేదీ నుంచి ఈమె ఇక్కడ చికిత్స పొందుతున్నారు. కంధమల్ జిల్లా దారింగిబాడి మండలం మొండీ పాంకొ గ్రామంలో మామిడి జావ ఆరగించి తీవ్ర అస్వస్థతకు గురై 2 మంది మృతి చెందారు. వీరిలో రమిత పట్టామాఝి, రున్ను మాఝి ఉన్నారు. ఈ సంఘటనలో 6 మంది అస్వస్థతతో ఆస్పత్రి పాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమించడంతో ఉన్నత చికిత్స కోసం కటక్ ఎస్‌సీబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన ఈ ఏడాది అక్టోబరు నెల 30వ తేదీన చోటు చేసుకుంది.

విరుచుకు పడిన విపక్షాలు

ఆకలి మంట తాళలేక కడుపు నింపుకునేందుకు బాధితులు మామిడి టెంకల జావని ఆరగించడం అనివార్యమైంది. ఈ పరిస్థితుల్లో వారు ఆకలి చావులకు బలి అయ్యారని విపక్ష బిజూ జనతా దళ్‌తో వామ పక్షం, కాంగ్రెసు వర్గాలు దుమ్మెత్తి పోశారు. రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వం ఆహార భద్రత కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు.

ఆర్డీసీ విచారణ

తీవ్ర కలకలం రేపిన మామిడి జావల మృత్యు సంఘటనపై దక్షిణ ప్రాంతపు రెవెన్యూ డివిజినల్ కమిషనర్ ఆర్డీసీ ఆధ్వర్యంలో విచారణకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్డీసీ రూపా రోషన్ ప్రభావిత ప్రాంతం ప్రత్యక్షంగా సందర్శించి బాధిత వర్గాలతో స్పందించారు. ప్రత్యేక వైద్య బృందం ఈ ప్రాంతం సందర్శించి ఆరోగ్యపరమైన బాగోగుల్ని పర్యవేక్షించింది. నిల్వ చేసిన ఆహారం కలుషితమై ప్రాణాంతకంగా పరిణమించిందని ప్రాథమిక విచారణలో వెల్లడించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



క్రీడా ప్రాంగణంలో అతిథులు

- జిల్లాస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



వేదికపై ఎమ్మెల్యేలు, నాయకులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి కుడుములగుమ్మ పంచాయతీలో మా బైరావీ జిల్లా స్థాయి ఫూట్‌బాల్ టోర్నమెంట్ సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఏడురోజులు పోటీలు జరగనున్నాయి. తొలిరోజు సోన్‌పూర్, బర్‌గాఢ్ జట్లు తలపడగా.. 2–4 తేడాతో బర్‌గాడ్ జట్టుపై సోన్‌పూర్ జట్టు విజయం సాధించింది. ముఖ్యఅతిథులుగా లక్ష్మపూర్ ఎమ్మెల్యే సహలి సామంతో, చిత్రకొండ ఎమ్మెల్యే మంగుకీలో, ఖోయిర్‌పూట్ సమితి అధ్యక్షుడు బిఘన్ ఖీర్సానీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవింధపాత్రో, గోవిందపల్లి సర్పంచ్ శ్రీనివాస ముదిలి పాల్గొన్నారు.

సన్నతుండి గ్రామంలో గ్రీవెన్స్‌కు స్పందన



సన్నతుండి గ్రీవెన్స్‌లో లబ్ధిదారులకు పట్టాల అందజేత



దివ్యాంగులకు బ్లాక్ తరఫున వీల్ చైర్లు పంపిణీ



రాయగడ బ్లాక్‌లో పోషణ పక్షోత్సవాల స్టాల్ తిలకిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ బ్లాక్ సన్నముండి పంచాయతీ కార్యాలయంలో గ్రామముఖి పరిపాలన, గ్రీవెన్సు సెల్‌కు కలెక్టర్ బిజయకుమార్ దాస్, ఎస్పీ జితేంద్ర నాథ్ పండా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్ ఇతర ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. రాయగడ బ్లాక్‌లో కొరడాసింగి, యస్.కొరడా సింగి, రాయగడ పంచాయతీల నుంచి మొత్తం 183 వినతులు రాగా, వాటిలో గ్రామ సమస్యలు 95, వ్యక్తిగతం 88 ఉన్నాయి. వాటిని సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం స్వయం సహాయక గ్రూపుల స్టాల్స్‌ను సందర్శించారు. కొందరు లబ్ధిదారులకు భూపట్టాలను అందజేశారు. ఈ గ్రీవెన్సు సెల్‌కు రాయగడ సమితి అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, ఐటీడీఏ అధికారి అంశుమాన్ మహాపాత్రో, బీడీఓ సుధీర్ సింగ్, సీడీఎంఓ డాక్టర్ యం.ఆలీ, డీఎస్ఎస్ఓ సంతోష్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన ఎస్‌బీ డీఎస్పీ


ఎస్పీ మహేశ్వరరెడ్డికి మొక్కను బహూకరిస్తున్న ఎస్‌బీ డీఎస్పీ సీతారామారావు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా జి.సీతారామారావు సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. అనంతరం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ ఎస్పీ


అడిషనల్ ఎస్పీ కె.వి.రమణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖ అదనపు ఎస్పీ (అడ్మిన్ విభాగం)గా కె.వి.రమణ సోమవారం ఉదయం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇంతకుముందు పనిచేసిన అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ బదిలీ అయిన సంగతి తెలిసిందే. కె.వెంకటరమణ కోనసీమ జిల్లా కొత్తపేట ఎస్‌డీపీవో (డీఎస్పీ)గా ఉంటూ ఇటీవలే అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది, రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. 1991 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన ఈయన విశాఖ సిటీలో ఎక్కువ కాలం పనిచేశారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో గల విభిన్న ప్రతిభావంతులకు కేటగిరీల వారీగా స్త్రీ, పురుషులకు వేరు వేరుగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కె.కవిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు కలెక్టరేట్ దగ్గరలో, డి.ఆర్.డి.ఎ కాంప్లెక్స్ ఎదురుగా గల, డచ్ భవనం ఎదురు మైదానంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని తెలిపారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడో సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 23వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సీనియర్ అధ్యాపకులను ఎగ్జామినర్లుగా జంబ్లింగ్ పద్ధతిలో నియమించినట్లు అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి డీన్ జి.పద్మారావు చెప్పారు.

పలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.సుజాత అన్నారు. వర్సిటీ నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగం, గంజాయి వినియోగం, చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై పోస్టర్ తయారీ, వీడియో లఘుచిత్రాలు అంశంపై పోటీ ఉంటుందని చెప్పారు. ఈ నెల 25వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, నోడల్ అధికారి జేఎల్ సంధ్యారాణి ఫోన్ నంబర్ 9866027906లను సంప్రదించాలని అన్నారు.

ఎస్‌జీటీ ఓవరాక్షన్‌పై ఫిర్యాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పలాస మండల పరిధిలోని ఎంపీయూపీ స్కూల్‌లో ప్రస్తుతం సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న తమ్మినాన శ్రీనివాసరావు డీఈవో కార్యాలయంలో చేసిన ఓవరాక్షన్‌పై ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ జిల్లాశాఖ (ఏపీఎస్ఈఎస్ఏ) ప్రతినిధులు మండిపడుతున్నారు. ఈనెల 7వ తేదీన సదరు ఎస్‌జీటీ శ్రీనివాసరావు డీఈవో కార్యాలయానికి వచ్చి నాన్ టీచింగ్ స్టాఫ్‌పై దుర్భాషలాడుతూ దౌర్జన్యంగా ప్రవర్తించినట్లు సంఘ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఎంపీయూపీ స్కూల్ పెద్దరోకల్లపల్లి ఎస్‌జీటీగా పనిచేస్తున్న సమయంలో మరో ఉపాధ్యాయుడితో జరిగిన ఘర్షణ కారణంగా శ్రీనివాసరావు సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఘర్షణ జరిగిన మరో ఉపాధ్యాయుడి పోస్టింగ్‌కు అనుకూలంగా డీఈవో కార్యాలయ సిబ్బంది పనిచేశారనే నెపంతో వారిపై విరుచుకుపడ్డారు. వారి అంతు చూస్తానని.. వారి అందరిపై లెటర్‌రాసి చస్తానంటూ భయపెట్టడంతో విషయాన్ని డీఈవో డాక్టర్ తిరుమల చైతన్య దృష్టికి తీసుకెళ్లారు. సంఘటన జరిగి రెండు వారాలు కావస్తున్నా సదరు ఉపాధ్యాయుడిపై డీఈవో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు(ఏపీఎస్ఈఎస్ఏ) జిల్లా కలెక్టర్‌ను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాకత్ ఆలీఖాన్, గోపాలకృష్ణ త్రిపాఠి, ఆరుగు పటాన్నాయక్, సూర్యప్రకాష్, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలే విజయ సూత్రం


ప్రసంగిస్తున్న విద్యామంత్రి నిత్యానంద గోండ్


ప్రారంభ గీతాలాపన చేస్తున్న ఉపాధ్యాయులు

- రాష్ట్ర స్కూల్స్, మాస్ ఎడ్యుకేషన్ మంత్రి నిత్యానంద గోండ్

జయపురం: నేటి విద్యార్థులే.. రేపటి దేశ రథసారథులని, వీరిని ఉత్తములుగా తీర్చిదిద్దాలని ఒడిశా రాష్ట్ర స్కూల్స్, మాస్ ఎడ్యుకేషన్ మంత్రి నిత్యానంద గోండ్ అన్నారు. సోమవారం స్థానిక నేహ్రూ నగర్‌లోని సిటీ ఉన్నత పాఠశాలలో ట్రస్ట్ తెలుగు సంస్కృతిక సమితి కొత్తగా నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్, క్లాస్ రూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ ఉంటుందని, ఆత్మ విశ్వాసంతో ఉంటే అద్భుత విజయాలు సాధించవచ్చన్నారు. తానేమీ చేయగలను అని భావిస్తే ఏమీ చేయలేరన్నారు. టీ విక్రయించే వ్యక్తి నేడు దేశ ప్రధాని అయ్యారని, ప్రపంచంలోనే గొప్ప వ్యక్తిగా పేరుగాంచారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పరోక్షంగా ఉదహరించారు. విద్యార్థులలో ఆత్మస్థైర్యం, సాధించాలన్న పట్టుదల ఉండాలన్నారు. తెలుగు సంస్కృతిక సమితి కార్యవర్గం పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణంలో, విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించి నడపటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కమిటీ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు 1981లో ఈ పాఠశాల ఏర్పాటుకు ఏర్పడిన పరిస్థితులు వివరించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో తెలుగు మాధ్యమాన్ని ఎత్తివేయటంతో 6వ తరగతి నుంచి తెలుగు బోధనతో ప్రారంభించిన సిటీ స్కూల్ అనేక బాలారిష్టాలు అధిగమించి నేడు ఈ స్థాయికి ఎదిగిందని వివరించారు. తెలుగు సంస్కృతిక సమితి, సిటీ గరల్స్ ఉన్నత పాఠశాలల ఫౌండర్ శశిపట్నాయక్ ఉపాధ్యాయుల కొరతను వివరించారు. స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు, ఈ సభలో నవరంగపూర్ ఎమ్మెల్యే గౌరీశంకర మఝి, జిల్లా విద్యాధికారి ప్రశాంత్‌కుమార్ మహంతి, హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు. కమిటీ సభ్యులు విద్యామంత్రిని సన్మానించారు. పాఠశాల విద్యార్థులు ఆదివాసీ నృత్యాలతో మంత్రికి స్వాగతం పలికారు.


పాఠశాలలో కాన్ఫరెన్స్ హాల్‌ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు


ఆదివాసీ నృత్యాలతో విద్యామంత్రికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు


సభలో పాల్గొన్న విద్యార్థులు


మంత్రిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

వినతుల వెల్లువ


గిరిజనుల సమస్యలు వింటున్న అధికారులు


కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళ

మల్కన్‌గిరి: జిల్లా చిత్రకొండ సమితి స్వభీమాన్ ఏరియా పెప్పరమేట్ల పంచాయతీలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు ఈ ప్రాంతాంలో మొత్తం 3754 మంది గిరిజనులు నివసిస్తున్నారు. 153 ఫిర్యాదులు స్వయంగా కలెక్టర్‌కు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ అతి త్వరలో ఇక్కడ ఉన్న ముఖ్య సమస్య పలు గ్రామాలకు రహదారిని పూర్తి చేస్తాన్నారు. గిరిజన రైతులు ఈ ప్రాంతాంలో పసుపు పంటకు కావల్సిన సౌకర్యలు కాల్పిస్తామన్నారు. ఈ స్వభీమాన్ ఏరియాలోని రల్లేగేడ, పనాస్పూట్, జోడాంబో, జాంత్రీ, గాజుల్ మామ్మిడి, జాన్‌బాయి, పెప్పరమేట్ల, బోడపోధర్, బోడపోడ పంచాయతీల్లో ఒకప్పుడు కేవలం గంజాయి సాగు మత్రమే పండించేవారు. గిరిజనులు మావోలు చేతిలో కీలు బోమ్మాల్లా ఉండేవారన్నారు. ఇప్పటికీ గిరిజనులకు అధికారులు అంటే ఎవరో తేలిసిందన్నారు. తమ గ్రామాల్లోకి అధికారులు రావడం ఎంతో ఆనందంగా ఉందని గిరిజనులు అంటున్నారు. కలెక్టర్, ఇతర అధికారులకు ఘన స్వగతం పలికారు. సబ్ కలెక్టర్ దూర్యోధన్ భోయి, జిల్లా అదనపు ఎస్పీ తపాన్ నారాయణ్ రోతో, చిత్రకొండ సమితికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌కు హాజరైన చిత్రకొండ సమితి ప్రభుత్వ ఉద్యోగులు

పోరాటం ఉద్ధృతం చేస్తాం




అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

- 6వ రోజు మున్సిపల్ కార్మికుల సమ్మె

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శానిటరీ మేస్త్రీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావులు మున్సిపల్ అధికార యంత్రాంగాన్ని హెచ్చరించారు. శానిటరీ మేస్త్రీలను అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ మున్సిపల్ శానిటరీ మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు 6వ రోజు సోమవారం అర్ధనగ్నంగా శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో చెత్త పేరుకుపోయి ప్రజారోగ్యాలు పాడైపోతున్నా అధికారులు పరిష్కారం చూపకపోవడం దారుణమన్నారు. అధికారులు వెంటనే కళ్లు తెరిచి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు, అల్లు రవి, టొంపల షణ్ముఖరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎస్ పార్థసారథి, ఆర్.గణేష్, అర్జీ పెద్దమనేద్ర, తారక, డి.రమణ, రసూల్, సోగ్గాడు, కె.తిరుమలరావు, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పైలెట్లుగా ఉండాలి


విద్యార్థినులతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మహిళలు పైలట్లుగా ఉండాలనే సరికొత్త లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఏవియేషన్ డే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా ప్రజలు ఎక్కడున్నా.. ఏ రంగంలో ఉన్నా కష్టపడి పని చేస్తారన్నారు. దీనికి మరింత నైపుణ్యం జోడిస్తే అన్ని రంగాల్లో రాణించవచ్చని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కేవలం 5 శాతం మంది మాత్రమే మహిళా పైలెట్లు ఉండగా, భారతదేశంలో 15 శాతం మంది ఉండడం గొప్ప విషయమన్నారు 'బేటీ కీ ఉడాన్.. దేశ్ కా స్వాభిమాన్' అనేది విమానయాన శాఖ ధ్యేయమని, యువతులను విమానయాన శాఖలోని మరిన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో పాటు మూలపేట పోర్టు నిర్మాణం పూర్తయితే జిల్లాలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా సంస్థ ఉపాధ్యక్షురాలు కమల చక్రవర్తి, సభ్యులు అంజలి చౌహా, అర్చన, కీర్తి తివారి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, సీహెచ్ కృష్ణారావు, పద్మావతి, మెట్ట సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా విజిలెన్సు దాడులు


బంగారం నగలు, ఆభరణాలు

భువనేశ్వర్: రాష్ట్ర విజిలెన్స్ వర్గాలు సోమవారం ముగ్గురు అక్రమ ఆస్తిపరులైన ప్రభుత్వ సిబ్బంది స్థావరాలపై దాడులు చేశాయి. ఢెంకనాల్ కామాఖ్య నగర్ సబ్ కలెక్టరు నారాయణ చంద్ర నాయక్, ఒడిశా పోలీసు హౌసింగ్ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజరు సుబాష్ పండా ఇండ్లపై భువనేశ్వర్, ఢెంకనాల్, బరంపురం, భద్రక్, మయూర్‌భంజ్ ప్రాంతాల్లో 14 వేర్వేరు చోట్ల ఏక కాలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మంది డీఎస్పీలు, 10 మంది ఇనస్పెక్టర్లుతో అనుబంధ సిబ్బంది పాలుపంచుకున్నారు. ప్రత్యేక విజిలెన్సు న్యాయమూర్తులు జారీ చేసిన గాలింపు చర్యల అధికార ఉత్తర్వులతో ఈ దాడులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మరో దాడిలో లంచం తీసుకుంటున్న స్త్రీ వైద్య నిపుణుడు డాక్టరు అశోక్ కుమార్ దాస్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఆయన కలహండి జిల్లా ప్రధాన ఆస్పత్రిలో సంయుక్త డైరెక్టరుగా పని చేస్తున్నారు. గర్భిణీ చికిత్స కోసం రూ. 6,000 లంచం తీసుకోగా.. అక్కడికక్కడ పట్టుబడ్డాడు.

సబ్ కలెక్టరు అక్రమ ఆస్తులు

ఢెంకనాల్ జిల్లా కామాఖ్య నగర్ సబ్ కలెక్టరు నారాయణ చంద్ర నాయక్ ఇళ్లలో విజిలెన్స్ వర్గాలు చేపట్టిన సోదాల్లో 4,800 చదరపు అడుగుల విస్తీర్ణపు 3 అంతస్తుల భవనం, 6900 చదరపు అడుగుల విస్తీర్ణపు 3 అంతస్తుల భవనం, 6200 చదరపు అడుగుల విస్తీర్ణపు 2 అంతస్తుల భవనం, 14 ఇళ్ల స్థలాలు, బ్యాంపు పొదుపు ఖాతాల్లో రూ. 34 లక్షల 57 వేలు, నగదు రూ.1 లక్ష 48 వేలు, బంగారం 365 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు.

డీజీఎం సంపన్నుడు

లెక్కాజమ లేని ఆర్జనలతో ఒడిశా పోలీసు హౌసింగు డిప్యూటీ జనరల్ మేనేజరు సుబాష్ పండా తులతూగుతున్నట్లు సోదాల్లో బట్టబయలైంది. ఈ సోదాల్లో లెక్కకు అందని 2 బహుళ అంతస్తు భవనాలు, 1 ఫ్లాటు, 870 గ్రాముల బంగారం, 5 ఇండ్ల స్థలాలు, నగదు రూ. 13 లక్షల 50 వేలు, పొదుపు, పెట్టుబడుల్లో రూ. 1 కోటి 80 లక్షలు ఉన్నట్లు గర్తించారు. సోదాల్లో అక్రమ సొమ్ము లెక్క బయటపడకుండా చేసేందుకు పొరుగింటి డాబాపైకి రూ. 10 లక్షల విలువైన నోట్ల కట్టల్ని విసిరేసినట్లు విజిలెన్సు అధికారుల దృష్టికి రావడం విశేషం.


డీజీఎం సుబాష్ పండా ఇంటి సోదాలో బయట పడిన నోట్ల కట్టలు

గాయపడిన వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బలరాంపేటకు చెందిన ఉయ్యాల వంశీకృష్ణ(24) ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతి చెందగా, అతని బావ కృష్ణ బరంపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. దీంతో ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పట్టణ ఎస్‌ఐ ఇ.చిన్నంనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన గుండెకు జీవం


వైద్య బృందంతో కోలుకున్న వ్యక్తి

- ఎయిమ్స్ సాధించిన అత్యద్భుతం

భువనేశ్వర్: స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్ అత్యద్భుతం సాధించింది. ఈ సంస్థ హృద్రోగ నిపుణులు ఊహాతీతమైన విజయం సాధించారు. సమారు ఒకటిన్నర గంటల సమయం ఆగిన గుండెని చలింపజేసి 24 ఏళ్ల యువకునికి పునర్జన్మని ప్రసాదించారు. అధునాతన ఎక్స్‌ట్రాకార్పోరియల్ కార్డియో పల్మనరీ రిససిటేషన్ (ఈసీపీఆర్) ప్రక్రియ ద్వారా ఇది సాధ్యమైందని ఎయిమ్స్ భువనేశ్వర్ కార్య నిర్వాహక డైరెక్టరు డాక్టరు అశుతోష్ బిశ్వాస్ తెలిపారు. వైద్య రంగంలో ఇదో మార్గదర్శక చొరవగా ఆయన వైద్య బృందాన్ని అభినందించారు. సాంకేతికతో వైద్య విజ్ఞానాన్ని అనుసంధానించడంలో భువనేశ్వర్ ఎయిమ్స్ ముందంజలో ఉంటుందన్నారు.

ఈ ఏడాది అక్టోబరు 1న గుండె ఆగిపోవడంతో అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో 24 ఏళ్ల యువకుడిని ఎయిమ్స్‌లో అత్యవసర చికిత్స కోసం చేర్చారు. అత్యాధునిక ఈసీపీఆర్ విధానంలో యువకుడికి చికిత్స చేశారు. డాక్టర్ శ్రీకాంత్ బెహరా, ఇంటెన్సివిస్ట్, అడల్ట్ ఎక్మో నిపుణుడు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందం 80 నిమిషాల పాటు నిరవధికంగా గుండె చప్పుడు స్తంభించిన (కార్డియాక్ అరెస్టు) తర్వాత కూడా ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (ఎక్మో) చికిత్స చేపట్టారు. 40 నిమిషాల ఈసీపీఆర్ చికిత్సతో రోగి గుండె మెల్లగా కొట్టుకోవడం ఆరంభించింది. దీంతో వైద్య బృందం ఊపిరి పీల్చుకుంది. అత్యంత సున్నితమైన విషయం కావడంతో 96 గంటలపాటు రోగిని అత్యంత సురక్షితంగా ఆరోగ్య స్థితిగతుల్ని ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఆ తర్వాత ఎక్మో నుంచి తొలగించిన ఆరోగ్యం నిలకడ పుంజుకుందని ధ్రువీకరించారు. వైద్య బృందం కృషిపై హర్షం వ్యక్తం చేశారు.

ఔషధాలపై జీరో జీఎస్టీ అమలు చేయాలి


కార్మిక పతాకం ఎగురవేసిన కృష్ణ చంద్ర సామంతరాయ్

జయపురం: దేశంలో అన్ని రకాల మందులపై జీరో జీఎస్టీ పరిధిలోనికి తీసుకురావాలని ఒడిశా సేల్స్ రిప్రెజింటివ్స్ యూనియన్ కొరాపుట్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక కార్మిక భవన ప్రాంగణంలో నిర్వహించిన 28వ జిల్లా కాన్ఫరెన్స్‌లో యూనియన్ అధ్యక్షుడు కృష్ణచంద్ర సామంతరాయ్ కార్మిక పతాకం (ఎర్ర జెండా) ఎగుర వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన అధ్యక్షతన జరిగిన కాన్ఫరెన్స్‌కు ముఖ్యఅతిథిగా సంబల్‌పూర్ యూనియన్ నేత డాక్టర్ కేదార్ నాత్ చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ మందుల ధరలు సామాన్యుడికి అందలేనంతగా పెరిగి పోయాయని, మందులపై జీఎస్టీ తొలగించి జీరో జీఎస్టీ పరిధిలోనికి తీసుకురావాలని కోరారు. ఔషధ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. దేశంలో మూతపడిన ప్రభుత్వరంగ ఔషధ కర్మాగారాలను తెరవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కలను అణిచివేసే నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సేల్స్ రిప్రజెంటీవ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. "పోరాటాలు చేసి డిమాండ్లు సాధించుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో సంఘ కార్యదర్శి రంజిన కుమార్ మిశ్ర, కార్మిక సమన్వయ కమిటీ ఉపాధ్యక్షుడు నళినీ రథ్, ఒడిశా సేల్స్ రిప్రెజింటీవ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ కుమార్ మిశ్ర, సహాయ కార్యదర్శి నృసింహ ప్రసాద్ బ్రహ్మ తదితరులు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను దుయ్యబట్టారు. జిల్లా ఒడిశా సేల్స్ రిప్రెజింటీవ్స్ యూనియన్ కొరాపుట్ నూతన కార్యవర్గ ఎన్నకలు నిర్వహించారు. సరోజ్ కుమార్ పట్నాయక్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా యోగెన్ చౌదరి, జిల్లా కార్యదర్శిగా రంజన్ మిశ్ర, కార్మదర్శిగా సంతోష్ దొలాయ్, కమిటీ సభ్యులుగా మోహన్ పాత్రో, దేబాశిష్ మిశ్ర, ఆశిష్ సాహు, శివ శంకర పాత్రో, ప్రిన్స్ కిలాడి, కృష్ణ చంద్ర సామంతరాయ్, బికాశ గౌడ, రవీంద్ర ప్రదాన్, అహమ్మద్ రాజ, సుమన్ సాహు, పవన్ కుమార్, నికుంజ సాహును ఎన్నుకున్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు


సమావేశంలో పాల్గొన్న సంఘ నేతలు

కొజ్జీరియాలో వైద్య బృందం స్పెషల్ డ్రైవ్


ఇంటింటా సర్వే చేపడుతున్న దృశ్యం

కవిటి: మండలంలోని కొత్త కొజ్జిరియాలో ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు రావడంతో పాటు, కీళ్ల నొప్పులతో ప్రజలు బాధపడుతున్నారని స్థానికుల ఫిర్యాదుతో జిల్లా వైద్యారోగ్యశాఖ స్పందించింది. దీనిలో భాగంగా సోమవారం గ్రామంలో జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్య బృందం వచ్చి స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వరాలకు కారణమైన దోమల నివారణ చర్యలు తీసుకున్నారు. స్థానిక బెలగాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రాకేష్, డాక్టర్ కవితల ఆధ్వర్యంలో వైద్య బృందం ఇంటింటికీ సర్వే నిర్వహించారు. పెద్ద సంఖ్యలో జ్వర పీడితులను గుర్తించి మలేరియా, డెంగీ పరీక్షలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి నల్లాన లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక సచివాలయం సిబ్బంది ఫ్రైడే డ్రై డే రోజు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ మలేరియా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించండి


ర్యాలీగా వెళ్తున్న హమాలీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సివిల్ సప్లయ్ హమాలీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఏపీ సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కాల గోవిందరావు డిమాండ్ చేశారు. స్థానిక సివిల్ సప్లయ్ గోడౌన్ వద్ద యూనియన్ పిలుపు మేరకు సోమవారం హమాలీలు ధర్నా నిర్వహించి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ.. గతేడాది డిసెంబర్‌లో హమాలీల కూలీ రేట్ల అగ్రిమెంట్ ముగిసినా, నేటికీ కొత్త కూలీ రేట్ల అగ్రిమెంట్ చేయకుండా సంబంధిత అధికారులు కాలయాపన చేయడం సరికాదన్నారు. హమాలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, వెంటనే కొత్త కూలీ రేట్లుతో అగ్రిమెంట్ ఇవ్వాలని కోరారు. కూలీ డబ్బులు కూడా సకాలంలో అకౌంట్లలో జమ అవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేసిన హమాలీల పీఎఫ్ డబ్బులు సకాలంలో రావడం లేదని తెలిపారు. కొత్తగా చేరినవారి పేర్లు రికార్డుల్లో నమోదు చేసి పీఎఫ్ అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సంఘ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, ఎంఎల్ఎస్ గోడౌన్ మేస్త్రీలు గౌరీ శంకర్, కృష్ణారెడ్డి, రామారావు, సీహెచ్ సతీష్, జి.దుర్యోధన, రాము, సీతయ్య, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోగస్ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలపై విచారణ



విచారణ చేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: బోగస్ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలపై ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి తన చాంబర్‌లో సోమవారం విచారణ చేసి 5 కేసులను పరిశీలించారు. ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇరువర్గాల వద్ద ఉన్న ఆధారాలను తనిఖీ చేశారు. అనంతరం విచారణను ఈనెల 25కు వాయిదా వేశారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, సూపరెంటిండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియనివ్యక్తి మృతి

జామి: మండలకేంద్రంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ విషయంపై పోలీసులు అందించిన వివరాల ప్రకారం భిక్షాటన చేస్తూ తిరుగుతుండే వ్యక్తి భీమసింగి గ్రామంలో ఆదివారం అనారోగ్యంతో పడి ఉండడంతో స్థానికులు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా..చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతదేహాన్ని విజయనగరం మార్చురీలో ఉంచారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా జామి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై వీరజనార్దన్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

చీపురుపల్లి: పట్టణంలోని జగన్నాథరాజు కాలనీ వినాయక టవర్స్‌లో నివాసం ఉంటున్న టి.నాగమణి(33) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఎల్.దామోదర రావు తెలిపారు. మృతురాలి భర్త ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సోమవారం ఇంట్లో అందరూ ఉండగానే క్షణికావేశంలో నాగమణి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఉరివేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త ప్రసాద్, బాబు నయాన్ష్, పాప గీతాన్ష్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోటీపరీక్షలకు ప్రిపేరవుతూ తన చిన్నాన్న ఇంటిలో ఉంటూ చదువుకుంటున్న పెనుమజ్జి అనిల్ కుమార్ (30) ఈ నెల 17న మధ్యాహ్నం బైక్‌పై మార్కెట్‌కు వెళ్తుండగా అయ్యన్నపేట జంక్షన్ యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద వెనుక నుంచి నిర్లక్ష్యంగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అనిల్ కుమార్ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108 సాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుని చిన్నాన్న పెనుమజ్జి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

భోగాపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న స్టేట్ బ్యాంకు–2 ప్రాంతానికి చెందిన ఆర్ ఉమాదేవి భర్త సొంత పనుల నిమిత్తం ఈనెల 15వ తేదీన పల్సర్ బైక్‌పై బయటకు వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి అదే రోజు రాత్రి 10 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ కనిపించకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పాపారావు తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

వంగర: మండల పరిధిలోని శివ్వాం గ్రామంలో ఏనుగుతల వెంకటనాయుడికి చెందిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ఎస్సై షేక్ శంకర్ సోమవారం తెలిపారు. వెంకటనాయుడు తన రేకుల షెడ్డులో ఆదివారం రాత్రి పార్కింగ్ చేసిన బైక్ సోమవారం ఉదయం చూసేసరికి లేకపోవడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోక్సో కేసు నమోదు

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని జమ్మునారాయణపురంలో ఏడేళ్ల బాలికపై సోమవారం లైంగికదాడి జరిగింది. దీనికి సంబంధించి విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి ఒంటరిగా ఉన్న ఏడేళ్ల బాలికపై కన్నేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో హుటాహుటిన డీఎస్పీతో పాటు దిశ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టి నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేశారు.

మూడు నామినేషన్ల తిరస్కరణ

సీతంపేట: జీసీసీ ఎన్నికలకు సంబంధించి 3 నామినేషన్‌లు తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మొత్తం 9 నామినేషన్‌లను అభ్యర్థులు దాఖలు చేయగా వివిధ కారణాల వల్ల బి.కృష్ణారావు, పి.ఆదినారాయణ, పి.సింహాచలంల నామినేషన్ స్క్రూట్నీలో తిరస్కరించామన్నారు. మిగతా ఆరుగురు సభ్యుల్లో చైర్మన్, వైస్‌చైర్మన్, నలుగురు బాడీ మెంబర్లను ఎన్నుకోనున్నట్లు చెప్పారు.

వినతులకు కచ్చితమైన పరిష్కారం



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులకు నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఏ రోజు వినతులు ఆ రోజే అధికారులు ఓపెన్ చేయాలని ఎక్కువగా రెవెన్యూకు చెందిన వినతులే వస్తున్నాయని తహసీల్దార్లు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికలో భాగంగా ఈ మేరకు అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జేసీ సేతుమాధవన్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ సర్వే మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని, అందుకు అవసరమైన మార్గదర్శకాలు త్వరలో విడుదల చేయనున్నట్లు, శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే స్కిల్ సెన్సస్ కూడా ఈ నెల నుంచే జరగాలని అందుకు అవసరమైన మాస్కర్ ట్రైనీలకు శిక్షణ కూడా పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో 48 రీచ్‌లు అందుబాటులో ఉన్నాయని ప్రతి రీచ్‌కు ఒక గ్రామ కార్యదర్శిని ఇన్‌చార్జ్‌గా నియమించామని, ఉచిత ఇసుకను పొందడానికి కార్యదర్శి దగ్గర నుంచి పొందిన రసీదును తీసుకుని ఇసుకను పొందవచ్చని తెలిపారు. లోకాయుక్త కేసులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించుకోవాలని ఆయా అధికారులకు జేసీ సూచించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి అర్జీదారుల నుంచి మొత్తం 205 అర్జీలు స్వీకరించారు.



పార్వతీపురం: అర్జీదారుల నుంచి వినతులను స్వీకరిస్తున్న జేసీ శోభిక

సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలి

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 31 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐ ఎ.లీలారావు, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

సమస్యల పరిష్కారానికి చర్యలు

పార్వతీపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)లో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్‌ఎస్ శోభిక తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జిలాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 156 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పార్వతీపురం: మూడు చక్రాల సైకిల్‌ను అందజేస్తున్న జేసీ శోభిక

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్‌ఎస్ శోభిక అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్ సందర్భంగా పలువురు దివ్యాంగులకు ఉపకరణాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సాలూరు మండలం జీగిరాం గ్రామానికి చెందిన టి.నర్సింహులు, గొర్లె వెంకటరావులకు వినికిడి యంత్రాలు, పార్వతీపురానికి చెందిన కె.మోహన్‌రావుకు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీసులో మంచి అధికారులుగా గుర్తింపు పొందాలి

• పీటీసీ ప్రిన్సిపాల్ డి.రామచంద్రరాజు

విజయనగరం క్రైమ్: పోలీస్‌శిక్షణ కళాశాలలో పూర్తిస్థాయిలో శిక్షణ పొంది సర్వీసులో మంచి అధికారులుగా గుర్తింపు పొందాలని పీటీసీ ప్రిన్సిపాల్ డి.రామచంద్రరాజు పేర్కొన్నారు. కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌లకు రెండు వారాల పాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని సోమవారం పీటీసీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పీటీసీలో ఇచ్చిన శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాసిన్ అడిషనల్ డైరెక్టర్ జె.ఎం.కిశోర్ మాట్లాడుతూ మంచి నైపుణ్యం కలిగిన అనుభవజ్ఞులైన వారితో పీటీసీలో ఇచ్చే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వారి సర్వీసులో ఎదురైన సవాళ్లు, వాటి పరిష్కరించిన తీరు గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్రిమినల్ లా, 2023 గురించి పూర్తిగా తెలుసుకోవాలని కోరారు. శిక్షణ కాలంలో అవుడోర్ శారీరక శిక్షణతో పాటు, ఆయుధాల మీద శిక్షణ, డ్రిల్, ఫైరింగ్ తదితర వాటిపై శిక్షణ ఉంటుందని చెప్పారు. పీటీసీలో ఉన్న అధునాతన డ్రైవింగ్ సిమిలేటర్, ఫైరింగ్ సిమిలేటర్‌పై శిక్షణ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో నాసిన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.గిరిధర్, వైస్ ప్రిన్సిపాల్ పీవీ.అప్పారావు, డీఎపీ టి.రమేష్, ఇండోర్, అవుట్‌డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు జిల్లా బాక్సర్ల ఎంపిక



విజేతలను అభినందిస్తున్న జేసీ సేతుమాధవన్

• అభినందించిన జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: ఆంధ్ర యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన జిల్లా బాక్సింగ్ క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అభినందించారు. ఏయూ స్థాయిలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా బాక్సింగ్ క్రీడాకారులు సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిశారు. 46–48 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ఎస్.తేజస్వి, 48–51 కిలోల విభాగంలో స్వర్ణ పతక విజేత ఎ.సాయి, 52 కిలోల విభాగంలో రజత పతక విజేత ఎస్.కే.సుల్తానా, 93 కిలోల విభాగంలో స్వర్ణ పతక విజేత జి.లిఖిత్ రెడ్డి జేసీని కలిసి వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారిని జేసీ అభినందిస్తూ జాతీయస్థాయిలో పంజాబ్‌లో డిసెంబర్ 26 నుంచి జరిగే అఖిల భారత విశ్వవిద్యాలయ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కోడిపందాల నిర్వహణలో పోలీస్ పాత్రపై విచారణ

• డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైమ్:

జిల్లాలోని ఎల్.కోట మండలం భీమాలిలో ఇటీవల కోడిపందాలను నిర్వహించిన వారిపై కేసు నమోదుచేయడంలో అలసత్వం ప్రదర్శించిన సంఘటనలో విచారణ కొనసాగుతుందని, అందుకు బాధ్యులైన వారిపై శాఖాపరంగా కఠినచర్యలు తప్పవని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 27న ఎల్.కోట మండలం భీమాలి గ్రామశివార్లలో కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు రైడ్ చేసి, వాహనాలు సీజ్ చేయడం, కేసు నమోదు చేయడంలో అలసత్వం ప్రదర్శించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లుగా ఎస్పీ వకుల్ జిందాల్ తనకు నివేదిక పంపించారన్నారు. ఈ నివేదిక ఆధారంగా ఎల్.కోట పీఎస్‌లో అసిస్టెంట్ రైటర్‌గా పనిచేస్తున్న జి.సత్యనారాయణ అనే కానిస్టేబుల్‌పై తక్షణమే సస్పెన్షన్ విధించినట్లు తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతుందని, పోలీసు అధికారుల పాత్ర ఉన్నట్లు వెల్లడైతే వారిపై కూడా క్రమశిక్షణ చర్యలతో పాటూ శాఖాపరమైన కఠినచర్యలు తీసుకుంటామని డీఐజీ స్పష్టం చేశారు.

220 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా, ఆటోను చూపిస్తున్న ఎస్సై పి.నారాయణరావు, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 220 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ఎస్సై పి.నారాయణ రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సందర్శన నిమిత్తం ఆదివారం రంగుపురం గ్రామానికి వెళ్తుండగా ఆ మార్గంలో అనుమానాస్పదంగా వస్తున్న ఆటోను తనిఖీ చేసి క్యాన్, రబ్బర్ ట్యూబ్‌లో సారాను గుర్తించినట్లు చెప్పారు. ఆటోలో సారా తరలిస్తున్న ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేయడంతో పాటు ఆటోను, సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు.

40 లీటర్ల సారా పట్టివేత

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పరిసర ప్రాంతాలలో అక్రమంగా సారా అమ్ముతున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్సై అనీష్ తెలిపిన వివరాల ప్రకారం చినమేరంగి పరిసర ప్రాంతాలలో సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేయగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరగడంతో అదుపులోకి తీసుకుని ఆ వ్యక్తి కలిగి ఉన్న 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

పది, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: సార్వత్రిక విద్యాపీఠం 2024–25 విద్యా సంవత్సరానికి పదవతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మంగళవారం నుంచి తత్కాల్ పద్ధతిలో అపరాధ రుసుము రూ.600తో ప్రవేశం పొందవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించేందుకు ఈ నెల 25 చివరి తేదీ అని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీఓవీ.ఇన్/ఏపీ ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లించవచ్చాన్నారు. ఏమైనా సందేహాలుంటే ఓపెన్ స్కూల్స్ జిల్లా కో–ఆర్డినేటర్, ఎం. సుధాకర రావు, సెల్ 9848223413 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


20న జిల్లాస్థాయి క్రీడాపోటీలు

పార్వతీపురంటౌన్: గిరిజన విద్యార్థులకు ఈనెల 20న జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని, ఈ పోటీలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాత్సవ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వాలీబాల్, ఆర్చరీ, జావెలిన్ త్రో తో పాటు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే ఏటీడబ్ల్యూఓ పరిధిలో ఎంపికైన క్రీడాకారులు మాత్రమే ఈ పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 26 వరకు విశాఖపట్నంలో జరగనున్న జన జాతీయ ఉత్సవాల్లో పాల్గొననున్నట్లు తెలియజేశారు.

20న ఐటీడీఏ స్థాయి క్రీడా పోటీలు

సీతంపేట: జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 20న ఐటీడీఏ స్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల క్లస్టర్ స్థాయిలో ఎంపికైన వారికి ఇక్కడి గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో పోటీలు జరగనున్నాయన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి క్రీడలు విశాఖపట్నంలో ఉంటాయని పేర్కొన్నారు.

అంతర్ వర్సిటీ క్రాస్‌కంటీ పోటీలకు సీతం విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల స్థాయిలో అథ్లెటిక్స్ విభాగంలోని క్రాస్ కంట్రీ ఈవెంట్‌లో పదివేల మీటర్ల పోటీలకు పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎం.సాయి యశ్వంత్ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో గల ఎస్‌ఆర్‌టీఎం యూనివర్సిటీలో జరిగే పోటీలకు జేఎన్‌టీయూజీవీ జట్టు తరపున యశ్వంత్ పాల్గొంటాడని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల మీద కక్ష సాధింపు

• ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

పార్వతీపురంటౌన్: రాష్ట్రవిద్యాశాఖ అధికారుల తీరు ఉపాధ్యాయుల మీద కక్ష సాధించుకునే విధంగా ఉందని, అందువల్లనే అనవసరమైన విషయాల మీద చర్చకు తావిస్తూ ఉపాధ్యాయులను బలిపశువులుగా చేస్తున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఉన్నత పాఠశాలల పని వేళలు దశాబ్దాల నుంచి రోజుకు 7 గంటల చొప్పున శాస్త్రీయంగా నిర్ణయించారన్నారు. విద్యార్థులు వారి ఇళ్ల వద్ద చదువుకోవడానికి కూడా వెసులుబాటు కలుగుతుందని, ప్రస్తుతం విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల చదువు పట్ల నిజమైన అపేక్ష ఉంటే ఉపాధ్యాయులను పూర్తిగా బోధనేతర పనులనుంచి మినహాయించి విద్యార్థుల పట్ల వారి నిబద్ధతను, చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలలో ఒకే శ్లాబ్‌లో ఇంటి అద్దె అలవెన్స్ పొందుతున్న ఉపాధ్యాయుల మధ్య చిచ్చు పెట్టడానికి జనాభా ప్రాతిపదికన బదిలీల్లో అసమానత్వాన్ని కలిగించడం అనాలోచిత నిర్ణయమన్నారు. ఇలాంటి అనవసరమైన గందరగోళానికి ఉపాధ్యాయులను గురికానివ్వకుండా చూడాలని ప్రభుత్వ అధికారులను కోరారు.

108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న 108 అంబులెన్సుల ఉద్యోగులు

• కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షల ప్రారంభం
• ఈనెల 25 నుంచి సమ్మె
• స్పష్టం చేసిన ఉద్యోగుల సంఘం

పార్వతీపురంటౌన్: 108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005వ సంవత్సరం నుంచి ప్రభుత్వం ప్రారంభించి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 108 అంబులెన్సు వ్యవస్థ దేశంలోని అత్యున్నతమైన ప్రజాసేవగా గుర్తింపు పొందిందన్నారు. అలాంటి వ్యవస్థను ప్రభుత్వం నేరుగా నిర్వహించకుండా ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లకు అప్పగించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్ సంస్థల లాభాపేక్ష వల్ల సర్వీసుల నాణ్యత పోతోందని ఆవేదన వెలిబుచ్చారు. అంబెలెన్సుల్లో పనిచేస్తున్న చేస్తున్న కార్మికులు ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ సదుపాయాలు గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించడం లేదని వాపోయారు.

వాహనాలు ఫిట్‌నెస్ లేకపోవడంతో ప్రమాదాలు

108 వాహనాలు ఫిట్‌నెస్ లేకపోవడం వలన ప్రమాదాలకు గురై అనేకమంది ఉద్యోగులు మరణిస్తున్నారని, వారికి ఎలాంటి పరిహారం ప్రభుత్వం గాని, యాజమాన్యం గాని చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పనిదినం అమలు చేయాలని, ప్రావిడెంట్ ఫండ్ యాజమాన్య వాటా యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలి

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఇప్పటికే అనేక దఫాలుగా ప్రభుత్వ అధికారులు, మంత్రులకు విన్నవించుకున్నామని, అయినప్పటికీ ఎలాంటి ఫలితం రాలేదని ఇప్పటికైనా 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని, లేనట్లయితే ఈనెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దావాల రమణారావు, వై.మన్మథరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, 108 ఉద్యోగుల సంఘం నాయకులు తెర్లి వెంకటరమణ, తెంటు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు కలెక్టర్ అభినందన




విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 11వ తేదీన జిల్లా స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా బాలికా సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ సోమవారం తన చాంబర్‌లో నగదు బహుమతులు అందజేశారు. ఒక్కో విభాగంలో ప్రథమ బహుమతి విజేతకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి విజేతకు రూ.3 వేలు, తృతీయ బహుమతి విజేతకు రూ.2 వేలు వంతున నగదు బహుమతులు అందజేశారు. వక్తృత్వం పోటీల్లో వి.లతాశ్రీ (బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తవలస), టి.లావణ్య (జెడ్‌పీహెచ్ వంగర), ఎం.రమ్య (కేజీబీవీ, గుర్ల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో పి.పరిమళ (ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల చీపురుపల్లి), పి.ప్రత్యూశ్రీ (ఏపీమోడల్ స్కూల్, షికారుగంజి), పి.భాగ్యశ్రీ (జెడ్పీ హైస్కూల్, కొట్యాడ), చిత్ర లేఖనంలో ఎం.గౌతమ్ (జెడ్పీ హైస్కూల్, దేవాడ) జి.జ్యోతి (కేజీబీవీ, గుర్ల), జి.మేఘన (బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తవలస) వరుసగా మూడుస్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో డీఈఓ మాణిక్యం నాయుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని బూర్జవలస పోలీస్‌స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో నేరం నిరూపణ కావడంతో ముద్దాయి దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామానికి చెందిన సైలాడ లక్ష్మణరావుకు విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి మూడేళ్ల జైలుశిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామానికి చెందిన సైలాడ లక్ష్మణరావు 2021లో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక వెంటపడి వేధింపులకు పాల్పడుతూ, కిడ్నాప్ చేసి, లైంగిక దాడికి పాల్పడ్డాడని బూర్జవలస పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కె.రాజేష్ కేసు నమోదుచేశారు. ఆ కేసు దర్యాప్తు పూర్తయ్యాక నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో సకాలంలో సాక్షులను, ఆధారాలను న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసి ముద్దాయిని నిర్ధారించి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో పోలీసుల తరపున మాజీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన



వీడియోకాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మరుగుదొడ్ల వినియోగంపై ఈ నెల 19 నుంచి డిసెంబర్ 10వ తేదీవరకు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్, గృహనిర్మాణం, సూర్యఘర్ తదితర అంశాలపై అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మరుగుదొడ్లు వినియోగంవల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. మరుగుదొడ్లను వినియోగించేవారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించాలని సూచించారు. దీనికి జిల్లా పంచాయతీ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. సౌరఘర్ పథకం కింద సౌరవిద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్‌ఎస్ శోభిక, ఈపీడీసీఎల్ ఎస్‌ఈ కె.చలపతిరావు, ఈఈ వేణుగోపాలనాయుడు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డుమా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, డీఈఓ ఎన్.తిరుపతినాయుడు, పీజీఆర్‌ఎస్ నోడల్ అధికారి రామ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.